క్లుప్తంగా

రాజ్యాంగంపై అవగాహన అవసరం



సెమినార్‌లో మాట్లాడుతున్న కొల్లా బ్రహ్మారెడ్డి

ఒంగోలు టౌన్: రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక ది కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ హాలులో ఆదివారం మన రాజ్యాంగం ఒక అవగాహన అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని అధికారంలో ఉన్న పాలకులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని చెప్పారు. రాజ్యాంగ పీఠికలో వున్న ప్రతి పదాన్ని సరిగా అర్థం చేసుకొని దేశం, ప్రజల పట్ల జాగరుకతతో వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. నేడు మనకు లభిస్తున్న అనేక హక్కులు అన్ని రాజ్యాంగం వల్లనే సాధ్యమయ్యాయని డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు అన్నారు. దేశంలో 0.1 మందికి మాత్రమే రాజ్యాంగంపై అవగాహన ఉందని తెలిపారు. ఇటీవల మరణించిన జేవీవీ జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణ కిషోర్‌కు నివాళి అర్పించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు చిట్టెం వెంకటేశ్వర్లు, కంచర్ల వెంకటేశ్వర్లు, కొల్లా మధు, గయాజ్, శ్రీపతి ప్రకాష్, కొండమ్మ, చిన్నాజి, చిల్లేళ్ల వెంకటేశ్వర్లు, మీనా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు



చెట్టు కొమ్మలు విరిగిపడటంతో విరిగిన విద్యుత్ స్తంభాలు

జరుగుమల్లి: మండలంలోని తూమాడు గ్రామం అశోక్‌నగర్ కాలనీ వద్ద ఆదివారం మధ్యాహ్నం వీచిన ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. దీంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి. తూమాడు, పాలేటిపాడు, సాధువారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ జి.హర్షీష్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పంట పొలాలకు సాగు నీరు విడుదల



చెరువు నుంచి సాగునీరు విడుదల చేస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: పంట పొలాల సాగు నిమిత్తం సంతనూతలపాడులోని పెద్ద చెరువు నుంచి సాగునీటిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆదివారం విడుదల చేశారు. నీరు వదిలేముందు పూజలు చేశారు. పెద్ద చెరువు పరిధిలో 400 ఎకరాల ఆయకట్టుకు, చిన్న చెరువు ద్వారా 125 ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన గత నాలుగున్నరేళ్లలో ఎప్పుడూ సాగునీటికి ఇబ్బంది ఏర్పడలేదన్నారు. సాగునీటిని సద్వినియోగం చేసుకుని రైతులు వరి పంట సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా



ది రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, తదితరులు



నోవాసిస్ హోటల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఆధునికీకరించిన ది రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ భవనం ప్రారంభం

ఒంగోలు: ఆర్యవైశ్యులకు అన్నివేళలా అండగా ఉంటానని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక నల్లూరి నర్సింగ్ హోం ఎదురుగా ఆధునికీకరించిన ది రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అందులో ఏర్పాటు చేసిన పువ్వాడ వెంకట సుబ్బయ్య కోటేశ్వరమ్మ (పీవీఎస్‌కేఆర్) ఏసీ ఫంక్షన్ హాలును కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ 1999లో తాను తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో తనను బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌కు ఆహ్వానించి సత్కరించిన వారిలో ప్రస్తుత రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అద్దంకి శ్రీనివాసరావు, కోడూరి సత్యం, ఏడుకొండలు ఉన్నారని, వారు తనకు జీవితకాలం గుర్తుంటారని అన్నారు. బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేసిన మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని కాంప్లెక్స్ ఎదురుగా సెప్టెంబర్ నెలలో ఆవిష్కరిస్తామన్నారు. బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ పైఅంతస్తు నిర్మాణానికి సంబంధించిన క్రమబద్ధీకరణ అంశంపై కూడా ముఖ్యమంత్రితో చర్చించామని, త్వరలోనే ఆ సమస్యను కూడా పరిష్కరిస్తామని తెలిపారు. నేడు రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ కమిటీ ప్రతినిధులు ఒక మంచి భవనాన్ని, అందరికీ అందుబాటులో ఉండేలా ఫంక్షన్ హాలును నిర్మించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఏ ఒక్కరికీ ఎటువంటి సమస్య రాకూడదని, ఒక వేళ సమస్య వస్తే ఆదుకునేందుకు మీ వాసు ఉన్నాడని గుర్తుంచుకోవాలని అన్నారు. రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు అద్దంకి శ్రీనివాసులు, కార్యదర్శి తువ్వాడ యానాదిశెట్టి, కోశాధికారి మద్దాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాము ఆధునికీకరించిన మినీ ఫంక్షన్ హాలును 500 మంది వరకు వినియోగించుకోవచ్చన్నారు. తాము నిర్ణయించే ధరలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, నగర మేయర్ గంగాడ సుజాత, శ్రీబాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ కమిటీ అధ్యక్షుడు కోడూరి సత్యం, వైఎస్సార్ సీపీ నాయకులు కటారి శంకర్, బాచి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, ఏపీ టైలర్స్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ సుభానీ, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

నోవాసిస్ హోటల్‌ను సందర్శించిన బాలినేని...

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా నూతనంగా ప్రారంభించిన నోవాసిస్ హోటల్‌ను ఆదివారం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సందర్శించారు. హోటల్ చైర్మన్ బాలిన చెంచురామయ్యతో కొద్దిసేపు మాట్లాడారు. హోటల్ వాతావరణం బాగుందంటూ ప్రశంసించారు. వినియోగదారుల మన్ననలు చూరగొనాలని ఆకాంక్షించారు.



డాక్టర్ చాపల వంశీకృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

పుచ్చకాయల గోవర్ధన్‌ను పరామర్శించిన బాలినేని...

స్థానిక వీఐపీ రోడ్డులో నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల గోవర్ధన్‌రెడ్డి మాతృమూర్తి సరస్వతమ్మ మరణించారు. ఆదివారం పెద్దకర్మ కావడంతో బాలినేని హాజరై గోవర్ధన్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

డాక్టర్ చాపల వంశీకృష్ణకు పరామర్శ...

ఒంగోలు అర్బన్: ప్రముఖ ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల వంశీకృష్ణ తల్లి చాపల అక్కమ్మ మరణించారు. ఆ సమయంలో విదేశీ పర్యటనలో ఉన్న బాలినేని.. ఆదివారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే టీజేఆర్



ఎమ్మెల్యే టీజేఆర్‌కు స్వాగతం పలుకుతున్న సుబ్బారావు, గ్రామ నాయకులు

మద్దిపాడు: ఇటీవల నూతన గృహ ప్రవేశం చేసిన మండలంలోని నాగన్నపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, సోషల్ మీడియా మద్దిపాడు కన్వీనర్ మద్దులూరి సుబ్బారావు ఆహ్వానం మేరకు సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆదివారం అతని ఇంటికి వెళ్లారు. సుబ్బారావు కుటుంబ సభ్యులను పలకరించి అల్పాహారం స్వీకరించి నూతన గృహ ప్రవేశం చేసిన సందర్భంగా అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మండవ అప్పారావు, శ్రీమన్నారాయణ, ఎర్ర దశరథ, గట్టినేని అయ్యన్న, పల్లంరెడ్డి బాలాంజిరెడ్డి, నర్రా సురేష్, మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, అన్వేష్, రాయపాటి రమేష్, కొమ్మూరి సుధాకర్, బొమ్మల రామాంజనేయులు, గ్రామ నాయకులు పైనం ప్రభాకర్, శ్రీరామమూర్తి, పైనం శ్రీను, పైనం ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



రైతులతో మాట్లాడుతున్న ఏపీడీ సుభాషిణి, రాధా శింగమనేని

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం బాగుంటుందని ఏపీడీ సుభాషిణి అన్నారు. మండలంలోని ఉలిచి గ్రామంలో రైతు సాధికారిక సంస్థ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్ట్ వారు నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 20 సెంట్లలో సంవత్సరం పొడవునా ఆదాయంతో పాటు ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయలు పండించే విధానంపై అవగాహన కల్పించారు. ఏటీఎం మోడల్‌లో తయారు చేయడం గురించి వివరించారు. నేటి కాలంలో ఆకుకూరలు, కూరగాయల ధరలు మారుతూ ఉన్నాయని, ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా సాగు చేస్తే డిమాండ్ ఉందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి రాధా శింగమనేని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మెంటర్స్ ఝాన్సీ, పద్మావతి, రైతు యూనిట్ ఇన్‌చార్జ్ రాధా, ఉలిచి సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బొద్దులూరివారిపాలెంలో రైతులు సాగుచేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు.

వైఎస్సార్ హయాంలో 87 ప్రాజెక్టులు



మాట్లాడుతున్న వీర్రాజు

చీమకుర్తి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన పాలనా కాలంలో రూ.2 లక్షల కోట్లతో 87 ప్రాజెక్టులు నిర్మించారని జగనన్న ఫౌండేషన్ అధ్యక్షుడు, ఇరిగేషన్ రిటైర్డ్ సీఈఓ వారా వీర్రాజు తెలిపారు. ఆదివారం చీమకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటి ఎకరాల సాగు లక్ష్యంగా ప్రాజెక్టులు నిర్మించిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కుతుందన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రజాసంకల్పయాత్ర ద్వారా ప్రజలకు చేరువైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 175 అసెంబ్లీ స్థానాలకుగానూ 151 స్థానాల్లో గెలుపొంది ముఖ్యమంత్రిగా నవరత్నాల సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడినై ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో 2022లో జగనన్న ఫౌండేషన్ పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశానని వీర్రాజు తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని వీర్రాజు తెలిపారు.

ఎంపీపీ సహకారంతో చిల్లచెట్ల తొలగింపు

కొత్తపట్నం: ఒంగోలు నగరంలోని కొప్పోలు నుంచి కొత్తపట్నం మండలంలోని అల్లూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై డివైడర్ మధ్యలో చిల్లచెట్లు పొదల్లా పెరిగాయి. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడటమే కాకుండా వాహనాలు కనపడక ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి దృష్టికి ప్రజలు తీసుకెళ్లగా, స్పందించిన ఎంపీపీ తన సొంత నిధులతో కూలీలను పెట్టించి చిల్లచెట్లు తొలగించే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఎదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బంది లేకుండా చేశారు. వాహన డ్రైవర్లు, ప్రయాణికులు, గ్రామస్తులు ఎంపీపీ అంజిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఐక్యంగా మెలగాలి



చీర్వానుప్పలపాడులో ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి దంపతులు



సర్వేరెడ్డిపాలెంలో మొక్కలు నాటుతున్న ఒంగోలు ఎంపీడీవో అజిత

నాగులుప్పలపాడు: ప్రతిఒక్కరూ ఐక్యంగా మెలిగి అమరుల త్యాగాలతో ఏర్పడిన స్వాతంత్య్ర ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. 76వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వసుధకు వందనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కండ్లగుంట, చీర్వానుప్పలపాడు, మద్దిరాలపాడు, చేకూరపాడు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమంలో హారతిచ్చి నేలతల్లికి నమస్కరించి జాతీయ జెండా ఆవిష్కరించారు. చీర్వానుప్పలపాడులో ఐక్యతా ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయమణి, సర్పంచ్‌లు పల్లెర్ల అంజిరెడ్డి, రమేష్, ఎంపీటీసీ పాద పవన్, పాలపర్తి రత్తయ్య, సంతోష్, ఏపీవో రవిబాబు, టీఏ పిచ్చయ్య, పోలినేని కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేరెడ్డిపాలెంలో...

ఒంగోలు రూరల్: మండలంలోని సర్వేరెడ్డిపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహించిన నిర్వహించిన వసుధకు వందనం కార్యక్రమానికి గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒంగోలు ఎంపీడీవో పి.అజిత మాట్లాడుతూ నేలతల్లి బాగుంటేనే మొక్కలు పెరుగుతాయని, ఆ మొక్కలే మానులై కార్బన్‌డయాక్సైడ్ గ్రహించి ఆక్సిజన్ విడుదల చేస్తాయని తెలిపారు. తద్వారా మానవాళి ఊపిరితీసుకుంటుందన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించి కాటన్ బ్యాగ్‌లు, జూట్ బ్యాగ్‌లు ఉపయోగించాలని కోరారు. ఈ విషయంపై అన్ని గ్రామాల కార్యదర్శులు దృష్టిసారించి ప్లాస్టిక్ బ్యాగులు వాడేవారికి, కొనుగోలు చేసేవారికి జరిమానా విధించాలని ఆదేశించారు. పర్యావరణ సమతుల్యత లోపించి ఓజోన్ పొర దెబ్బతిని అతినీలలోహిత కిరణాలు ప్రసరించడం వలన అనేక జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

వాలీబాల్ కోచ్‌కు సన్మానం



కోచ్ రమణారావును సత్కరిస్తున్న ప్రకాశం జిల్లా వాలీబాల్ సంఘ ప్రతినిధులు

ఒంగోలు: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వాలీబాల్ కోచ్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన కేవీ రమణారావును ప్రకాశం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక పాటిబండ్ల గోపాలస్వామి ఫంక్షన్‌హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేవీ రమణారావు వాలీబాల్ కోచ్‌గా రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులను ఎంతోమందిని తయారుచేశారని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సూదనగుంట కోటేశ్వరరావు, కార్యదర్శి జి.ధనుంజయరావు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కోటా సత్యమాంబదేవికి పూజలు



బేస్తవారిపేట : ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి



కొనకనమిట్ల : ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



మార్కాపురం టౌన్ : ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి



కొనకనమిట్ల : బారులుదీరిన కుంకుమ బండ్లు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గంగమ్మతల్లికి పొంగళ్లు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో ఆదివారం సాయంత్రం గ్రామ దేవత గంగమ్మతల్లికి గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కుంకుమ బండ్లు కట్టి ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ముందుగా అమ్మవారి కళశంతో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి వచ్చి నైవేద్యాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి గ్రామం పాడి పంటలతో పచ్చగా ఉండాలని పూజలు చేశారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా ముగిసిన మొహర్రం వేడుకలు



పీర్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



డీజీ పేటలో పీర్లతో గుండంలో నడుస్తున్న భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని డీజీపేటలో మొహర్రం వేడుకల్లో భాగంగా పీర్ల గుండప్రవేశం, పీర్ల గ్రామోత్సవం కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు. గత 10 రోజులుగా జరుగుతున్న ఈ వేడుకల్లో ఆదివారం ఆఖరిరోజు వేకువజామున పీర్లను ఎత్తుకున్న భక్తులు నిప్పుల గుండం తొక్కారు. అనంతరం సాయంత్రం వేళ మంగళవాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్చుతూ పీర్లకు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం పీర్లస్నానంతో వేడుకలు ముగిశాయి. హిందూ, ముస్లింలు వేడుకల్లో పెద్దసంఖ్యలో పాల్గొని పీర్ల దీవెనలు పొందారు.